క్లుప్తంగా

అట్టహాసంగా స్కూల్ గేమ్స్

హొళగుంద: ఇంగళదహాళ్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ గేమ్స్ నిర్వహించారు. అండర్–14, అండర్–17 విభాగాలకు సంబంధించి హొళగుంద, ఇంగళదహాళ్, హెబ్బటం, సుళువాయి, గజ్జహళ్లి పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు రాంధాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను ఎంఈఓ–1 సత్యనారాయణ, ఎంఈఓ–2 జగన్నాథం ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. స్కూల్ గేమ్స్‌లో కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, యోగా, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించినట్లు పీడీ రాందాస్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తాలూకా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు.

వార్డు మెంబర్ మృతి


ఈరన్న (ఫైల్)

కోసిగి: మండల కేంద్రంలోని సిద్ధప్ప పాళెంలో నివాసం ఉంటున్న 8వ వార్డు మెంబర్ ముకుంద ఈరన్న (97) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. ఆయన కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలం పనిచేశారు. 8వ వార్డుకు 5 సార్లు దాదాపు 25 ఏళ్ల పాటు వార్డు మెంబర్‌గా పనిచేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీ చేసి గెలుపొందారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి తదితరులు సంతాపం తెలిపారు. అలాగే కోసిగి మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడు ఈరన్నకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఆదోనిఅర్బన్: ఆదోని పట్టణంలో వైఎంకే స్కూల్ ముందున్న పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో రిటైర్డ్ హెచ్ఎం కీ.శే.సూరప్ప జ్ఞాపకార్థంగా మంగళవారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మల్లికార్జున, డాక్టర్ రాహుల్, ఫ్యామిలీ డాక్టర్ రాజా, రమేష్, మల్లికార్జున, తరుణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో డాక్టర్ సోమశేఖర్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరంలో ఎక్కువగా మోకాళ్ల నొప్పులు, కాలేయ జబ్బులు, కామెర్లు, మలేరియా, చికున్‌గున్యా, విషజ్వరాలు, గర్భసంచి వ్యాధులు, చర్మవ్యాధులకు సంబంధించిన ప్రథమ చికిత్స అందించి మందులను పంపిణీ చేసినట్లు వైద్యుడు సోమశేఖర్ తెలిపారు.

కల్వర్టుకు మరమ్మతులు చేపట్టండి


కల్వర్టుకు మధ్యలో ఏర్పడిన గుంత

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలో ఎడవ రహదారిలో కల్వర్టుకు మధ్యలో గుంత ఎర్పడింది. కాలువలో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగించి మురుగు నీరు సాఫీగా వెళ్లేందుకు కల్వర్టు మధ్యలో రంధ్రం ఏర్పాటు చేశారు. కాలువలో చెత్తను తొలగించి నెలలు గడిచినా కల్వర్టుకు ఎర్పాటు చేసిన గుంతను మాత్రం అలాగే వదిలేశారు. దీంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. కల్వర్టుకు చుట్టు పక్కల ఉన్న కుటుంబాలు అయా పనుల నిమిత్తం వస్తూ పోతూ ఉంటారు. ఏ మాత్రం అజాగ్రతగా ఉన్నా ప్రమాదం చోటు చేసుకొనే అవకాశం ఉంది. ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నాణ్యమైన విద్యాబోధన అందించాలి


దేవరబెట్ట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలితో మాట్లాడుతున్న ఎంఈఓ-2 నాగేశప్ప

కోసిగి: పాఠశాలలో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యాబోధనను అందించాలని ఎంఈఓ-2 నాగేశప్ప సూచించారు. మంగళవారం కోసిగి మండలం దేవరబెట్ట ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాల వేళకు ఉపాధ్యాయులు హాజరుకావాలని సూచించారు. సిలబస్ ప్రకారం విద్యను బోధించాలన్నారు. బడి మధ్యలో మానేసిన పిల్లలు ఉంటే వారి ఇళ్లకు వెళ్లి పాఠశాలకు ఎందుకు రావడం లేదో తల్లిదండ్రులను విచారించాలన్నారు. పిల్లల కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, ప్రతి రోజు బడికి పంపించాలని అవగాహన కల్పించాలన్నారు. చదువుకుంటే బంగారు భవిష్యత్ ఉంటుందని తెలియజెప్పాలన్నారు. సీఆర్‌పీ యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ మురిపించెన్

- మంత్రాలయం నియోజకవర్గంలో 877 మందికి రూ.24,59,500 మంజూరు
- ప్రతి గ్రామంలో కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభం


దుద్ది గ్రామంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోసిగి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త పింఛన్ కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే చాలు వెంటనే మంజూరవుతుంది. అవ్వతాతలు, వికలాంగులు, వితంతువులకు అర్హత ఉంటే చాలు పార్టీలకు అతీతంగా గ్రామంలో ఎలాంటి వ్యయప్రయాసాలు లేకుండా పింఛన్ వచ్చేస్తోంది. గత ప్రభుత్వంలో మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా ఆ పార్టీ జన్మభూమి కమిటీ సభ్యుల ఆమోదం మేరకు వారికి అనుకూలంగా ఉండే వారికే పింఛన్లు వచ్చేవి. అవి కూడా లబ్ధిదారులు ఎవరైనా మరణిస్తే వాటి స్థానంలో మంజూరు చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా 1వ తేదీన వలంటీర్ల ద్వారా వేకువజామునే ఇంటి తలుపు తట్టి చేతికి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. ప్రతి ఆరు నెలకోసారి కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు. దీంతో అవ్వతాతలు, వికలాంగులు, వితంతువులు ఇతరులపై ఆధారపడకుండా పింఛన్ సొమ్ముతో ఆనందంగా ఉంటున్నారు.

- మంత్రాలయం నియోజకవర్గంలో ఆగస్ట్ నెలలో కొత్తగా 877 మందికి పింఛన్లు మంజూరు కాగా రూ.24,59,500 నగదు విడుదలైంది. మంజూరైన పింఛన్లు వెరిఫికేషన్‌కు రావడంతో మండల స్థాయి, వెల్ఫేర్ అసిస్టెంట్స్ పూర్తి స్థాయిలో విచారణ చేయడంతో బడ్జెట్ విడుదల చేశారు. మంగళవారం నుంచి కోసిగి మండలంలోని అన్ని గ్రామాల్లో కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభించారు.

గత ఆగస్ట్ నెల వరకు కోసిగి మండలంలో 7,136 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.1,98,60,000
కౌతాళం మండలంలో 8,391 మందికి రూ.2,32,22,500, మంత్రాలయం మండలంలో 6,787 మందికి రూ.1,87,44,500, పెదకడబూరు మండలంలో 6409 మందికి రూ.1,78,41,500 ప్రతి నెలా మంజూరయ్యేది. ఈ నెల నుంచి అదనంగా మరో 877 మందికి గానూ రూ.24,59,500 మంజూరవుతోందని అధికారులు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరుకావడంతో అవ్వాతాతలు, వితంతువులు, వికలాంగులు సంతోషం వ్యక్తం చేశారు.

మంత్రాలయం నియోజకవర్గంలో మండలాల వారీగా మంజూరైన కొత్త పింఛన్లు

మండలం	కొత్త పింఛన్లు	నగదు (రూ.)
కోసిగి	249	7,02,500
కౌతాళం	282	7,86,750
మంత్రాలయం	210	5,86,750
పెద్దకడబూరు	136	3,83,500
మొత్తం	877	24,59,500


కొల్మాన్ పేట గ్రామంలో కొత్త పింఛన్లు అందిస్తున్న నాయకులు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛను



ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయించాం. వికలాంగులకు సదరం సర్టిఫికెట్ ఆధారంగా వెరిఫికేషన్ చేసి ఇచ్చాం. ఇంకా ఎవరైనా అర్హత కలిగిన వారు ఉంటే వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. – రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ

చాలా సంతోషంగా ఉంది



నా భర్త లక్ష్మయ్య ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. వలంటీర్ ద్వారా పింఛన్ కోసం గ్రామంలోనే సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. కొత్తగా పింఛన్ వచ్చింది. వలంటీర్ రూ.2,750 నగదు అందించారు. చాలా సంతోషంగా ఉంది. ఈ నగదు నా కుటుంబానికి ఎంతో ఆసరాగా ఉంటుంది. – బెళగల్ లక్ష్మి, పింఛన్ లబ్ధిదారురాలు, దుద్ది గ్రామం

పైసా ఖర్చు లేకుండా పింఛన్ వచ్చింది



మాది దుద్ది గ్రామం. కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తున్నాం. ఏడాది క్రితం అనారోగ్యంతో నా భర్త హనుమంతు చనిపోయాడు. భర్త మరణ ధృవీకరణ పత్రం తీసుకుని వలంటీర్ ద్వారా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. గ్రామంలో ఉంటూ ఒక్క పైసా ఖర్చు లేకుండా కొత్త పింఛన్ మంజూరు చేయించారు. – గొర్లి పక్కీరమ్మ, పింఛన్ లబ్ధిదారురాలు, దుద్ది గ్రామం

వృద్ధాప్య పింఛన్ వచ్చింది



నా వయస్సు 60 ఏళ్లు దాటింది. ఆధార్ కార్డు ఆధారంగా పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. కొత్తగా పింఛన్ వచ్చింది. ఇంటి వద్దకే వచ్చి రూ.2,750 ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది. ఇబ్బందులు లేకుండా పింఛన్ మంజూరు చేశారు. – వెంకయ్య, పింఛన్ లబ్ధిదారురాలు, కొల్మాన్‌పేట

ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు

ఆదోని సెంట్రల్: సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ ఇంటర్ అడ్మిషన్లు జరుగుతున్నాయి. చదవుకోవాలని ఆశ ఉండి అనివార్య కారణాలు, ఆర్థికపరమైన ఇబ్బందుల వల్ల మధ్యలో బడి మానేసిన వారికి ఇది మంచి అవకాశం. చిరుద్యోగులు, గృహిణులు, మెకానిక్‌లు, టైలర్లు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనే వారు ఇంటి వద్ద ఉండి చదువుకునేందుకు అవకాశం ఉంది. చదువుకోవాలనే ఆసక్తి కలిగిన వారు దగ్గర్లోని ఆన్‌లైన్ సెంటర్ లేదా మీసేవా కేంద్రాలలో తమ పేరును రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు కొరకు 10వ తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్, ఒరిజినల్ టీసీ, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలు, బ్యాంకు అకౌంట్ బుక్ తీసుకెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్టర్ కొరకు రూ.2,200 చెల్లించాల్సి ఉంటుంది. తరగతుల ప్రవేశాలకు జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.1400, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలు రూ.1100 చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంజన్న సూచించారు. అడ్మిషన్లు రిజిష్టర్ చేసుకోవడానికి అక్టోబర్ 5వ తేదీ వరకు సమయం ఉందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పొలం తగాదాలో ఇద్దరిపై కేసు

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో పొలం తగాదా విషయంలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా హెడ్ కానిస్టేబుల్ ఆనందరాజు మంగళవారం విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన రంగన్న పెద్ద భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు రంగన్న చిన్న భార్య కుమారుడైన మహేష్, పద్మపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నీరు కట్టుకునే విషయంలో మహేష్, పద్మ కలిసి గోవిందమ్మపై దాడి చేశారని బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

సమస్యలను అధిగమించాలి


మాట్లాడుతున్న సైకాలజిస్ట్ వెంకటసుబ్బయ్య

ఆదోని సెంట్రల్: సమస్యలు వచ్చినపుడు వాటిని అధిగమించేందుకు ప్రయత్నం చేయాలి తప్పా, మానసికంగా కుంగిపోకూడదని డాక్టర్ చైతన్యకుమార్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ వెంకటసుబ్బయ్య సూచించారు. పట్టణంలోని అర్‌అర్ లేబర్ కాలనీలోని పురపాలక ఉన్నత పాఠశాలలో.. ఆత్మహత్యల నివారణ – మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవితమంటేనే కష్టసుఖాల సమ్మేళనం. సుఖానికి అలవాటు పడ్డ వారు కష్టాలను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి సమస్యకు చావే పరిష్కారం కాదన్నారు. సమస్య వచ్చినపుడు స్నేహితులతోను, ఆత్మీయులతోను, తల్లిదండ్రులతోను పంచుకుంటే పరిష్కారం దొరుకుతుందని చెప్పారు. ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కోవాలి తప్ప పిరికివాళ్ల లాగా పారిపోకూడదన్నారు. మానసిక సంఘర్షణకు లోనుకాకుండా మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. సమస్య ఉన్నప్పుడు టోల్ ఫ్రీ నంబర్ 14416 కు కాల్ చేస్తే మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండే విధంగా ట్రైనర్స్ అవగాహన కల్పిస్తారని తెలిపారు. ముఖ్యంగా పొగాకు ఉత్పత్తుల వాడకానికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. వాటి వల్ల వచ్చే అనర్థాలు, అనారోగ్య సమస్యలను విద్యార్థులకు వివరించారు. సామాజిక వేత్త సోమశేఖర్, ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పురాతన బావికి ప్రహరీ నిర్మాణం


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి

ఆదోనిటౌన్: పట్టణంలోని ఎస్కేడీ కాలనీలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు ఆనుకొని ఉన్న పురాతన బావి చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులను మంగళవారం ప్రారంభించారు. మున్సిపల్ ఫండ్స్ రూ.10 లక్షలు వెచ్చించి పనులు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. పురాతన బావి కావడం వల్ల నీరు పుష్కలంగా ఉన్నాయని, అయితే వీధిలోని ప్రజలు వ్యర్థ పదార్థాలను పారవేయడం వల్ల నీరు కలుషితమవుతోందన్నారు. మోటార్ల సాయంతో నీటిని బయటకు తోడేసి, స్వచ్ఛమైన నీటిని ప్రజలకు వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. పురాతన కట్టడాలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని చెప్పారు. అనంతరం కార్వన్‌పేటలో చేతిపంపులకు రిపేరీ పనులను పరిశీలించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చేతి పంపులు, మినీవాటర్ పంపుల నిర్వహణపై దృష్టి సారించామన్నారు. ఎంఈ నాగభూషణ్ రెడ్డి, కౌన్సిలర్ లక్ష్మీదేవి, వార్డు ఇన్‌చార్జ్ నగరూరు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.

వరద కాలువ నిర్మించాలి


మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆదోనిరూరల్: అక్టోబర్ మొదటి వారంలో మేలిగనూరు వరద కాలువ నిర్మాణం కోసం పాదయాత్ర నిర్వహిస్తామని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, ఉపాధ్యక్షుడు మల్లయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆదోనిలోని మార్కెట్ కమిటీ రోడ్డు సుందరయ్య భవన్‌లో ఏపీ రైతు సంఘం ఆదోని, కౌతాళం మండలాల కమిటీల ఆధ్వర్యంలో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదోని డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో వర్షాభావం వల్ల తీవ్రమైన కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని, తక్షణమే కరువు మండలాలుగా ప్రకటించి రైతులకు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు నష్ట పరిహారం చెల్లించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. అలాగే రైతు, కౌలు రైతు, కూలీల రుణాలు మాఫీ చేయాలని కోరారు. దేవాలయ వక్ఫ్ భూముల కౌలు రద్దు చేయాలన్నారు. కరవు శాశ్వత నివారణ కోసం తుంగభద్ర నది నుంచి మేలిగనూరుకు వరద నీరు కాలువ నిర్మించాలన్నారు. అక్టోబర్ మొదటి వారంలో మెలిగనూరు నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే పాదయాత్రలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి


ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి

కోసిగి: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా చూడాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి ఆదేశించారు. ఆయన మంగళవారం కోసిగి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. బిల్లులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ రవికుమార్, మంత్రాలయం డీఈ లాలికృష్ణయ్య, ఏఈ శేఖర్ బాబు ఉన్నారు.

కౌతాళం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కొంత మంది ఇళ్లు నిర్మించుకున్నా కిచెన్, టాయిలెట్ నిర్మించుకోలేదని వీటిని వెంటనే పూర్తి చేసి బిల్లులు తీసుకోవాలన్నారు. మండలంలో గృహ నిర్మాణ పనులు చాలా వెనుకబడి ఉన్నాయని ఇప్పటివరకు 7 శాతం మాత్రమే పూర్తి చేశారన్నారు. అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. ఈఈ రవికుమార్, డీఈ లాలికృష్ణయ్య, ఎంపీడీఓ సుబ్బారాజు, ఎంఈఓ శోభరాణి, ఎస్ఎస్ఎ ఏఈ శివశంకర్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటకలోని హోస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. కొద్ది రోజుల క్రితం దాదాపు 500 క్యూసెక్కులకు పడిపోయిన ఇన్‌ఫ్లో జలాశయం ఎగువ భాగంలో అడపదడప కురుస్తున్న వర్షాలకు మంగళవారం 2,554 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయం నుంచి 9,995 క్యూసెక్కుల నీటిని వివిధ కాలువలకు వదులుతున్నారు. ఉదయం డ్యాంలో నీటి నిల్వ 68.503 టీఎంసీలు ఉంది. ఆంధ్రాకు సంబంధించి దిగువ కాలువ (ఎల్లెల్సీ) 250 కి.మీ వద్ద 635 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

ఆదోనిరూరల్: కొత్తగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అశోక్ కుమార్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. అర్హులైన రైతులు రైతు భరోసా కేంద్రానికి వెళ్లి పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌ను అందించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏదైనా కారణాల వల్ల అప్లికేషన్ రిజెక్ట్ అయితే కారణం చూపుతూ సంబంధిత అధికారులకు మెసేజ్ వస్తుందని చెప్పారు. వివరాలకు స్థానిక రైతు భరోసా కేంద్రంలో అధికారులను సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌతాళం: మండలంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నర్సన్న తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆదోని నుంచి వచ్చే 33 కేవీ లైన్‌లో మరమ్మతు పనులు జరుగుతుండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏ మృతి



నరసప్ప (ఫైల్)

కర్నూలు: మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన వీఆర్‌ఏ నరసప్ప రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాధవరం నుంచి రచ్చుమర్రి గ్రామానికి వెళ్తుండగా బాట మారెమ్మవ్వ గుడి వద్ద వీఆర్‌ఏ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ముందుగా వెళ్తున్న ఎద్దుల బండిని ఢీకొట్టింది. దీంతో నరసప్ప (40) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మార్తమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మాధవరం పోలీసులు ప్రమాదంపై విచారణ చేపట్టారు.

కుక్కల దాడిలో 34 గొర్రె పిల్లలు మృతి

నందవరం: మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో మంగళవారం కుక్కల దాడిలో 34 గొర్రె పిల్లలు మృతి చెందాయి. గ్రామంలో రైతు, గొర్రెల కాపరి కాశప్ప గారి కురవ రమేష్ సోమవారం పెంటలో గొర్రె పిల్లలను ఉంచి గొర్రెల మందను మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం పెంటకు గొర్రెలను తీసుకుని వెళ్లి, వేర్వేరుగా గొర్రెలను, పిల్లలను వదిలాడు. మంగళవారం ఉదయం పెంటకు వెళ్లగా అందులో కుక్కలు దాడి చేయడంతో 34 గొర్రె పిల్లలు మృతి చెందాయి. రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లడంతో కాపరి కన్నీరు మున్నీరయ్యాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

ఆరోగ్య సర్వే పక్కాగా చేపట్టాలి


మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నాగేశ్వరరావు

కౌతాళం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే పక్కాగా నిర్వహించాలని డీఎల్‌డీఓ నాగేశ్వరరావు సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్బారాజు అధ్యక్షతన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం ద్వారా వలంటీర్లు తమకు కేటాయించిన 50 ఇళ్లలో దగ్గు, జలుబు, దీర్ఘకాలిక వ్యాధులు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించాలన్నారు. ఈనెల 30న ప్రత్యేక శిబిరం నిర్వహించి వ్యాధిగ్రస్తులకు చికిత్స అందించనున్నట్లు తెలిపారు. తహసీల్దారు, ఎంపీడీఓ బృందాలు గ్రామాలకు వెళ్లి వలంటీర్లు సేకరించిన వివరాల ప్రకారం ఆ కుటుంబసభ్యులకు అవగాహన కల్పిస్తారన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, వైద్యాధికారులు శిరీష, ఈమాన్యుయల్, ఎంఈఓ శోభరాణి, ఈఓపీఆర్‌డీ జనార్దన్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈరన్న స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు


ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

కౌతాళం: ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మంగళవారం కుటుంబ సమేతంగా తరలివచ్చి ఉరుకుంద ఈరన్న స్వామిని దర్శించుకున్నారు. శ్రావణమాసంలో విడి రోజుల్లో భక్తులు తక్కువ ఉంటారని భావించి ఈ రోజు దర్శనానికి వచ్చినట్లు తెలిపారు. ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, కమిటీ డైరెక్టర్లు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ప్రధాన, ఉప ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, మహదేవ స్వామి శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఆలయ పర్యవేక్షకులు రామ్మోహన్‌రావు, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, వడ్డెరాము తదితరులు ఉన్నారు. అనంతరం బుడుములదొడ్డి ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నిర్మాణాల్లో వేగం పెంచండి


థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఆదోని ఎంపీడీఓ గీతావాణి

ఆదోనిరూరల్: ఆదోని మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లను ఎంపీడీఓ గీతావాణి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయంలో.. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదోని మండలంలో 766 ఇళ్ల నిర్మాణాలు థర్డ్ పార్టీ కాంట్రాక్టర్లు చేపడుతున్నారని, ఇందులో కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా 400 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నిర్మాణాల్లో అలసత్వం వహించడం సరికాదన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పేమెంట్, డ్వాక్రా గ్రూపు నిధులు త్వరితగతిన అందిస్తామని కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేయకుండా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఎంఎస్ఈఆర్‌జీఎస్ ఏపీఓ చంద్రశేఖర్, ఏపీఎం జనార్ధన్, హౌసింగ్ ఏఈ రవి, వర్క్ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

పత్తికొండ టౌన్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని పత్తికొండ డివిజన్ ఆర్డీఓ మోహన్‌దాస్ సూచించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డితో కలిసి రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు, గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా గణేష్ వేడుకలను నిర్వహించాలన్నారు. మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. మండపాల ఏర్పాటులో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, వాహనాల రాకపోకలు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. 18న గణేష్ విగ్రహాలు ప్రతిష్ఠించి 20వ తేదీన నిమజ్జనం చేసుకోవాలన్నారు. అర్బన్, రూరల్ సీఐలు మురళీమోహన్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సర్కిల్ ఎస్ఐలు, తహసీల్దార్, ఎంపీడీఓ పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం

గోనెగండ్ల: పండ్ల తోటల సాగుచేసుకుంటే రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని ఉద్యానవన శాఖ అధికారిణి శ్రీవాణి, కోర్స్ డైరెక్టర్ సుజాత అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో పండ్లతోటల పెంపకదారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం మామిడి, జామ, సపోట, దానిమ్మ, చీని, కొబ్బరి, నిమ్మ పండ్ల మొక్కలను ఉచితంగా అందజేయడంతో పాటు మొక్కల పెంపకానికి ప్రోత్సాహం అందిస్తుందన్నారు. మండలంలోని గోనెగండ్ల, చిన్నమరివీడు, అలువాల, ఐరన్‌బండ, గాజులదిన్నె, పుట్టపాశం, వేముగోడు, గంజిహళ్లి గ్రామాల్లోని రైతులు పండ్ల తోటలను సాగుచేశారని తెలిపారు. పండ్ల తోటల పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఏపీఓ మహమ్మద్ బాష, ఈసీ ఉస్మాన్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.